www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి టిఎన్జిఓఎస్ అండ!



4

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 292 గురువారం 19-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

జపాన్ వ్యవసాయ విధానాలపై కలెక్టర్ అంకిత్ అధ్యయనం!

- ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడుల సాధనపై క్షేత్రస్థాయి పరిశీలన
- వ్యవసాయ యాంత్రీకరణ, వినూత్న సాగు పద్ధతులపై ప్రత్యేక దృష్టి
- జిల్లాలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఉత్తమ విధానాల అన్వయానికి కసరత్తు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉత్పాదకతను పెంపొందించే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ జపాన్‌లో పర్యటిస్తూ అక్కడి ఆధునిక వ్యవసాయ విధానాలను అధ్యయనం చేస్తున్నారు. పర్యటనలో భాగంగా వివిధ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సాగులో వినియోగిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

జపాన్‌లో పంటల సాగు నుంచి పంటల నిర్వహణ వరకు ప్రతి దశలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. పరిమిత వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ తక్కువ సమయంలో, తక్కువ శ్రమతో అధిక దిగుబడులు సాధించేందుకు అక్కడి రైతులు అనుసరిస్తున్న వినూత్న పద్ధతులపై అవగాహన పొందారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర, సమయం మరియు శ్రమ ఆదా చేస్తూ మెరుగైన ఉత్పాదకత సాధించే విధానాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేశారు.

జపాన్ పర్యటనలో గుర్తించిన ఉత్తమ వ్యవసాయ





రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు!

- ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు వేగవంతం చేయాలి
- పీఎం రాహత్ పథకం కింద ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం
- జిల్లాలో 432 ప్రమాదాలు.. 206 మంది మృతి.. 425 మందికి గాయాలు
- మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి: డీఆర్వో పద్మావతి

కొత్తగూడెం, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన భద్రతా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

432 రోడ్డు ప్రమాదాలు.. 206 మంది మృతి

జిల్లాలో జనవరి 1 నుంచి మిగతా 3లో..

రైతుల ధాన్యం కొనుగోలుకు ఐదు కేంద్రాలు సిద్ధం!

- పాల్వంచ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి
- దొడ్డు రకానికి రూ.2,441, ఏ గ్రేడ్‌కు రూ.2,461 మద్దతు ధర
- ఎంపిక చేసిన సన్నధాన్యం రకాలకు క్వింటాకు రూ.500 బోనస్

పాల్వంచ, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఐదు కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసినట్లు సొసైటీ చైర్మన్, మిగతా 2లో..



సంస్కృతి సంప్రదాయాల పరిమళంతో బంజారా వనమహోత్సవం



- బంజారా బంధాల ఆత్మీయ కలయిక.. ఐక్యతకు వన సమారాధన వేదిక
- ఈ నెల 22న రఘునాథపాలెంలో అంగరంగ వైభవంగా వనవహోత్సవ వేడుకలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా బంజారా కుటుంబాలన్నింటికీ ఆత్మీయ ఆహ్వానం
- బంజారాల వనసమారాధన మహోత్సవ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 18 (భద్రాద్రిన్యూస్) :

కుల బంధాల ఆత్మీయతను చాటుతూ.. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని భావితరాలకు అందిస్తూ.. బంజారా జాతి ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ఈ నెల 22న ఆదివారం బంజారాల వన సమారాధన మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్ తెలిపారు. పార్టీలు, వర్గాలు, సంఘాలకు అతీతంగా బంజారా కుటుంబాలన్నీ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఆనందంగా గడిపేలా ఈ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రఘునాథపాలెంలోని నాగమ్మ గుడి ఎదురుగా ఉన్న ఆర్జీబీ మామిడి తోటలో ఆదివారం ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి బంజారా కుటుంబాల సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు, కళాకారులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా మిగతా 2లో..



పెన్షన్ల పంపిణీలో సర్పంచ్‌లకు అవమానం...!

- **ఎంపీడీవో పక్షపాత వైఖరిపై సీపీఎం, బీఆర్ఎస్ సర్పంచ్‌ల నిరసన..**
- **వెంటనే ఎంపీడీవోను సస్పెండ్ చేయాలి.. ఫ్లకార్డులతో ఆందోళన.**

ముదిగొండ, నవంబర్18 (భద్రాద్రి న్యూస్):-

గ్రామ సర్పంచ్‌లకు ఎలాంటి సమాచారం లేకుండా, వారి ప్రమేయం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్ పత్రాలను పంపిణీ చేయడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ సీపీఎం, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, నాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఫ్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ గేదెలు, పింఛన్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లకు కనీస గౌరవం ఇవ్వకుండా, అధికార పార్టీ నాయకుల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ద్వారా ఎన్నికైన సర్పంచ్‌లను పక్కనపెట్టి ప్రభుత్వ పథకాల పంపిణీని పార్టీ నాయకులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో ఎంపీడీవో విజయ పనితీరు, వ్యవహారశైలి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆమె కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల పక్షపాత వైఖరి వల్ల ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్‌లకు అవమానం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవోను వెంటనే సస్పెండ్ చేయాలని, అవసరమైతే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీలో సర్పంచ్‌లకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ముదిగొండ, చిరుమర్రి, పండ్రేగుపల్లి, న్యూలక్ష్మీపురం సర్పంచ్ లు కట్టకూరి ఉపేందర్, సామినేని రాంబాబు ,పాము స్వర్ణలత, సలీమున్నీసాబేగం, ఉప సర్పంచ్ లు చెరుకూరి పార్వతీ, రాయల శ్రీనివాసరావు, శివరాత్రి రాంబాబు, మల్లెల శంకర్, మాజీ ఎంపీపీ సామనేని హరిప్రసాద్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు పురుషోత్తం, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బంక మల్లయ్య, పాము సిల్వరాజు, ఖాసిం బాబు, బీఆర్ఎస్, సిపిఎం వార్డు సభ్యులు దస్తగిరి, సతీష్, తాత నరేష్, నాజీర్, ఉపేందర్ చారి తదితరులు ఉన్నారు.

జపాన్ వ్యవసాయ విధానాలపై కలెక్టర్ అంకిత్ అధ్యయనం!

మొదటిపేజీ తరువాయి

విధానాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, స్థానిక పంటల సాగు విధానం, రైతుల అవసరాలకు అనుగుణంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నారు. తద్వారా జిల్లాలో వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు, రైతులకు ప్రయోజనం చేకూర్చే వినూత్న సాగు విధానాలను ప్రోత్సహించేందుకు ఈ అధ్యయనం దోహదపడనుంది.







అంకితభావానికి గుర్తింపు..

- **హెడ్ కానిస్టేబుల్ నర్సింహారావు కు ఏఎస్ఐ గా పదోన్నతి..!**
- **గన్నె నరసింహారావుకు సీఐ మురళీ, పోలీస్ సిబ్బంది అభినందనలు.**

ముదిగొండ, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):-

ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో గత తొమ్మిదేళ్లుగా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల ప్రజల మన్ననలు పొందిన గన్నె నరసింహారావు ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. గతంలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయన విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో గుర్తింపు పొందారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఎస్ హెచ్ ఓ వడ్డేపల్లి మురళి ఆదేశాలు పాటిస్తూ.. వచ్చిన వారిపై మర్యాదగా వ్యవహరిస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన గన్నె నర్సింహారావు ను ఈ సందర్భంగా ముదిగొండ సీఐ వడ్డేపల్లి మురళీ, పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ, కొత్త బాధ్యతల్లోనూ అదే అంకితభావంతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తోటి సిబ్బంది సైతం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంస్కృతి సంప్రదాయాల పరిమళంతో బంజారా వనమహోత్సవం

మొదటిపేజీ తరువాయి

తరలివచ్చి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆహ్వానించారు.

బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. బంజారా జాతి ఐక్యత, అభివృద్ధి, సంక్షేమంతో పాటు విశిష్టమైన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు పరిచయం చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ వన సమారాధనకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. నేటి బిజీ జీవితాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు కలిసి మనసారా మాట్లాడుకునే అవకాశాలు తగ్గుతున్న నేపథ్యంలో.. జాతి మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి అనుబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ వేడుక ప్రధాన ఉద్దేశమని వివరించారు.

నీతి, నిజాయితీ, కష్టపడి జీవించే తత్వానికి ప్రతీకగా నిలిచే బంజారా జాతి గొప్పతనాన్ని చాటేలా సంప్రదాయ కళలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బంజారా నృత్యాలు, నెమలి నాట్యం, బిందెలతో చేసే సంప్రదాయ నృత్యాలు, కళాకారుల డప్పు వాయిద్యాలు, ఆటపాటలు, ఆనందోత్సాహాల నడుమ రోజంతా ఉత్సవ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పిల్లలు తమ జాతి మూలాలను, పెద్దలు తమ సంస్కృతి వైభవాన్ని మరోసారి గుర్తుచేసుకునేలా.. యువత సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకునేలా ఈ మహోత్సవం నిలవనుంది. కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెంపొందిస్తూ, ఆత్మీయ పలకరింపులు, అనుబంధాల కలయికతో ప్రతి ఒక్కరికీ మధుర జ్ఞాపకాలను అందించాలనే లక్ష్యంతో కమిటీ సభ్యులు రాత్రింబవళ్లు శ్రమిస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకను ఒక సంఘానికి లేదా ఒక వర్గానికి పరిమితం చేయకుండా యావత్ బంజారా జాతి కుటుంబ సమ్మేళనంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ సొంత ఇంటి పండుగగా భావించి తరలిరావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. బంజారా జాతి ఐక్యతను చాటుతూ, రాబోయే తరాలకు సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని అందించే ఈ మహోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో చిరస్మరణీయంగా నిలపాలని పిలుపునిచ్చారు.

ఈ విలేకరుల సమావేశంలో కోకన్వీనర్లు భూక్యా మంగ్య నాయక్, మాలోత్ రామారావు నాయక్, కో శాధికారులు డాక్టర్ మంగీలాల్ జాదవ్, గంగావత్ రమేష్ నాయక్, కార్యదర్శులు భూక్యా శోభన్ నాయక్, భూక్యా చంద్రు నాయక్, వి. తిరుపతి నాయక్, గౌరవ సలహాదారులు మూడ్ బాల్ సింగ్ నాయక్, ధరంసోత్ చక్రవర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల ధాన్యం కొనుగోలుకు ఐదు కేంద్రాలు సిద్ధం!

మొదటిపేజీ తరువాయి

డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభాత్‌నగర్ (రెడ్డిగూడెం), కారేగట్టు, సోనులగూడెం, పాల్వంచ పట్టణంలోని పేటచెరువు (గుడిపాడు) ప్రాంతాల్లో ఐదు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కామన్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441, ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,461 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్ సెగ్మెంట్, కేఎన్ఎం 1638, వరంగల్ 44, కేఎన్ఎం 7715 రకాల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

పంట రుణాలు తీసుకున్న రైతులు గడువులోగా ఏడు శాతం వడ్డీ చెల్లించి రుణాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు. అలా చెల్లించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడు శాతం వడ్డీ రాయితీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వివరించారు. గడువు దాటిన రుణ బకాయిలకు 13 శాతం వడ్డీ వర్తించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోందని తెలిపారు. సొసైటీలో యూరియా, 20013 రకం ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల కోరారు.

ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, సామా జనార్దన్ రెడ్డి, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధు, సీఈఓ జి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



23 రోజుల ఉద్యోగుల పోరాటానికి ప్రజా సంఘీభావం!

- **ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ టి యు ఎన్ టి ఈ ఏ కృతజ్ఞతలు**
- **ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వీసీ సానుకూల హామీ**
- **ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలు, మేధావులకు ప్రత్యేక ధన్యవాదాలు**

హైదరాబాద్, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం 23 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా సాగిన ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టి యు ఎన్ టి ఈ ఏ) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఉద్యోగుల హక్కుల సాధన కోసం సాగించిన పోరాటంలో వివిధ వర్గాలు అందించిన మద్దతు, సంఘీభావం తమకు కొండంత నైతిక బలాన్ని ఇచ్చాయని అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కంఠం ప్రేమ్ కుమార్ సంయుక్తంగా వెల్లడించారు.

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సాగిన ఈ ఉద్యమానికి ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు, పౌర సంఘాలు, శ్రేయోభిలాషులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా నిలిచి, ఉద్యమానికి సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వీసీ హామీతో ఉద్యోగుల్లో కొత్త ఆశలు

ఉద్యమంలో భాగంగా వైస్ ఛాన్సలర్ రవీందర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యోగుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం సానుకూల పరిణామమని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంబంధిత సభ్యులతో చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సానుకూల స్పందన ఉద్యోగుల్లో ఆశలు చిగురింపజేసిందన్నారు.

ఐక్యతే బలం.. హక్కుల సాధనే లక్ష్యం

23 రోజుల పాటు సాగిన ఉద్యమంలో ఉద్యోగుల ఐక్యత, వివిధ సంఘాల సహకారం, ప్రజల సంఘీభావం కీలక పాత్ర పోషించాయని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన



సమస్యల పరిష్కారానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, న్యాయమైన సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా సంఘం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

'ఉద్యోగుల ఐక్యతే మన బలం.. న్యాయమైన హక్కుల సాధనే మన లక్ష్యం' అనే నినాదంతో ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని అధ్యక్షుడు అబ్దుల్ కదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కంఠం ప్రేమ్ కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు!





మొదటిపేజీ తరువాయి

అక్టోబర్ 31 వరకు నమోదైన రోడ్డు ప్రమాదాల వివరాలను అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కాలంలో మొత్తం 432 ప్రమాదాలు జరగగా, వాటిలో 193 ప్రాణాంతక ప్రమాదాలు, 239 ప్రాణాపాయం లేని ప్రమాదాలుగా నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 206 మంది ప్రాణాలు కోల్పోగా, 28 మంది తీవ్రంగా, 397 మంది స్వల్పంగా గాయపడ్డారు. మొత్తం 1,055 ప్రమాదాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు.

ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతుండటంపై డీఆర్వో ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు తదితర వాహనాల డ్రైవర్లు సీట్‌బెల్టు ధరించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు. ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రోడ్డు గుర్తులు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారుల భద్రతకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

పీఎం రాహత్ పథకంతో

రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటల్ కేర్) పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం ఉందని డీఆర్ఎం బాలాజీ వివరించారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఈ పథకం ద్వారా వైద్య సహాయం అందుతుందని తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని డీఆర్వో పద్మావతి ఆదేశించారు. ఇదే సమావేశంలో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీతో ఆమె సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో ఇప్పటివరకు 89 కేసులు నమోదు కాగా, 2,200.89 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.11,25,94,500గా ఉందని, ఈ కేసుల్లో 274 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు 109 మందిని డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను దుర్భరం చేస్తుందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, కార్మికులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సీహెచ్. వెంకటేశ్వర్లు, ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు, డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, వైద్యశాఖ అధికారులు డాక్టర్ వీరబాబు, ఆరోగ్యశ్రీ ప్రతినిధి మహేష్, పోలీస్ అధికారులు కరుణాకర్, విజయలక్ష్మి, రవాణాశాఖ ఏఎంవీఐ శ్వేత, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ ప్రతినిధి మోహన్ రావు, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్, ఎక్సైజ్, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయం సందర్శించిన ఎస్సై, సర్పంచ్

ములుగు, భద్రాద్రి న్యూస్ :

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నెలకొల్పిన పాఠశాల గ్రంథాలయాన్ని గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చల్లా ధర్మరాజులు సందర్శించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి వారు హాజరైన సందర్భంగా గ్రంథాలయ ఇన్చార్జి తెలుగు పండితు కొండ్ల కృష్ణమూర్తి వారిని గ్రంథాలయానికి ఆహ్వానించారు దీనితో గ్రంథాలయానికి వచ్చి వారు వివిధ రకాల పుస్తకాలను పరిశీలించి గ్రంథాలయానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు పాఠశాలలో ఇంత చక్కని గ్రంథాలయం



ఏర్పాటు చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి సురేష్ ను ఇన్చార్జి కొండ్ల కృష్ణమూర్తిని వారు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిరక్షణ కమిటీ చైర్మన్ కార్పోతుల యాదగిరి ఉపసర్పంచ్ కొండ తిరుపతి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పాల్వంచ అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ!

- **శరణుఘోషతో మార్మోగిన అయ్యప్ప సన్నిధి**
- **ఆలయ అభివృద్ధికి సేవలందిస్తున్న పూజారులు, గురుస్వాములకు ఘన సన్మానం**
- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దేవాలయ కమిటీ అధ్యక్షులు కొత్వాల**

పాల్వంచ, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన అయ్యప్ప దేవాలయంగా పేరొందిన పాల్వంచ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మహా పడిపూజ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు బేతంశెట్టి వెంకట్, బేతంశెట్టి విజయ్‌ల మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అయ్యప్ప నామస్మరణలు, శరణుఘోషలతో భక్తిపారవశ్యాన్ని నింపింది.

ఈ సందర్భంగా దేవస్థాన పూజారులు మాధవన్ నంబూద్రి, బృందావనం నరసింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి మహా పడిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు, వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం ఆలయ అభివృద్ధికి, భక్తులకు ఆధ్యాత్మిక సేవలందిస్తున్న పూజారులు, గురుస్వాములను కొత్వాల శ్రీనివాసరావుతో పాటు ట్రస్ట్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గురుస్వాములు, సేవకుల కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు కాల్వ భాస్కర్ రావు, మేడిద సంతోష్ గౌడ్, కనగాల రాంబాబు, బి. శ్రీనివాస్, వేమారెడ్డి, కమిటీ సభ్యులు ఏ. శంకర్ మణి, మల్లెల నాగేంద్రం, పిలకా రమేష్, నరహరి, భట్టు మంజుల, పావని తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40 ఉద్యోగాలు!

- **ఈ నెల 20న ఖమ్మంలో భారీ జాబ్ మేళా**
- **ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ అభ్యర్థులకు అవకాశం**
- **రూ.12 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనం**
- **హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు: ఉపాధి అధికారి మాధవి**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం మొత్తం 40 ఖాళీలతో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రెండు కంపెనీల్లో 40 ఉద్యోగ ఖాళీలు

ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ (TTDC) కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన రోషన్ టెక్నాలజీ కంపెనీలో 20 పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రొడక్షన్ అసోసియేట్, అసెంబ్లీ ఆపరేటర్, మెషిన్ ఆపరేటర్, వేర్‌హౌస్ అసోసియేట్, టెక్నీషియన్ విభాగాల్లో విద్యార్హతలను బట్టి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.ఈ పోస్టులకు ఐటీఐ (అన్ని ట్రేడ్లు), డిగ్రీ, డిప్లొమా, బీటెక్, బీఈ పూర్తి చేసిన ఫ్రెషర్స్‌తో పాటు అనుభవం ఉన్నవారు కూడా అర్హులని, గరిష్ఠంగా రూ.15 వేల వరకు వేతనం ఉంటుందని వివరించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఎలక్ట్రో సర్క్యూట్ సిస్టమ్ (ECS) ఇండస్ట్రీలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో మరో 20 ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడ్లు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.15 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు, అదనంగా రూ.6 వేల టీఏ, డీఏ అందించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి తప్పనిసరిగా ద్విచక్ర వాహనం ఉండాలని స్పష్టం చేశారు.

18 నుంచి 30 ఏళ్ల వారికి అవకాశం

మొత్తం 40 ఉద్యోగ ఖాళీలకు 18 నుంచి 30 సంవత్సరాల మధ్యవయస్సుగల యువతీయువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి రూ.12 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనాలు లభిస్తాయని పేర్కొన్నారు.

20న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా

అర్హత, ఆసక్తి కలిగిన ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ కార్యాలయానికి నేరుగా హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వజ్ఞ విద్యార్థుల విశేష ప్రతిభ

- **వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రతిభా పురస్కారాలు కైవసం**

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):-

సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు వివిధ స్థాయిలలో నిర్వహించిన సాంస్కృతిక, శాస్త్రీయ మరియు అవగాహన పోటీలలో తమ అసాధారణ ప్రతిభను కనబరిచి బహుమతులు, ప్రశంసా పత్రాలు సాధించారని పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు మరియు డైరెక్టర్ కె. నీలిమ మేడమ్ గారు తెలిపారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'బాలోత్సవ్2026' పోటీలలో సర్వజ్ఞ విద్యార్థులు ఘన విజయం సాధించారు. జానపద నృత్యం విభాగంలో 6వ తరగతి విద్యార్థిని బి. కార్తిక సాన్వి అత్యుత్తమ ప్రదర్శన కనబరచగా, గ్రూప్ డాన్స్ విభాగంలో పాల్గొన్న సర్వజ్ఞ విద్యార్థుల బృందం విజేతగా నిలిచి విన్నర్స్ షీల్డ్ ను కైవసం చేసుకుంది. గ్రూప్ డాన్స్‌లో ప్రతిభ చూపిన ఎస్. శరణ్య, జి. అన్విక, ఎ. గగన , ఎమ్. సమన్వి , బి. జితీష్ , సిహెచ్. గీత లహరి , జి. చిన్మయి, బి. రక్షిత, బి. గౌరి, సి. మౌల్య, బి. హేతన, ఎస్.కె. అఫ్సా, ఎమ్. అక్షిత, బి. నేహా మాధురి, వై. తన్వి, జోష్ణ, తన్మయి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అలాగే NSP క్యాంప్, మంచికంటి భవన్‌లో 'విజ్ఞాన దర్శిని' ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిస్టుల వేషధారణ పోటీలలో కె. కీర్తి శివాని, ఎస్. బృంద, కె. మిష్టి, ఎస్. యశో కీర్తన్, ఎమ్. యశ్వంత్, ఎండి. అఫ్రోజ్ లతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ (ఖమ్మం జిల్లా) ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాషా ముక్త్ భారత్' క్విజ్ పోటీలలో టి. చేతన్ అద్విక్, పి. జస్మితా శ్రీ, నిత్య, శరణ్య విద్యార్థులు పాల్గొని సర్టిఫికేట్లు అందుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ... "విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో సర్వజ్ఞ ఎల్లప్పుడూ ముందుంటుంది. చదువుతో పాటు కళలు, సైన్స్, సామాజిక అవగాహన పోటీలలో విద్యార్థులు ప్రతిభ చూపడం అభినందనీయం" అని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మేడమ్ గారు మాట్లాడుతూ... "బాలోత్సవ్‌లో గ్రూప్ డాన్స్ విభాగంలో విన్నర్స్ షీల్డ్ సాధించడం, ఇతర పోటీలలో సర్టిఫికేట్లు గెలుచుకోవడం పాఠశాలకు ఎంతో గర్వకారణం. విజేతలైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు" అని తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి టిఎన్జిఓఎస్ అండ!

- **ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాం**
- **ఐక్యతతోనే సమస్యల పరిష్కారం.. సంఘటితంగా ముందుకు సాగాలి**
- **హామీ ఇచ్చిన టిఎన్జిఓఎస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు**

ఖమ్మం, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):



జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల్లో పనిచేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న ఉద్యోగపరమైన, పరిపాలనా సమస్యల పరిష్కారానికి టిఎన్జిఓఎస్ యూనియన్ సంపూర్ణ అండగా ఉంటుందని ఆ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

బుధవారం ఖమ్మంలోని టిఎన్జిఓఎస్ యూనియన్ కార్యాలయంలో టి హెచ్ డబ్ల్యు ఓ ఎస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు అధ్యక్షతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిఎన్జిఓఎస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు విద్యార్థుల విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, సంక్షేమం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల బాగోగుల కోసం నిరంతరం శ్రమించే వారి ఉద్యోగం ఎంతో ఒత్తిడితో కూడుకున్నదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను యూనియన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో పరిష్కరించగల సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం విషయంలో టిఎన్జిఓఎస్ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

టిఎన్జిఓఎస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యలను ఐక్యంగా, క్రమబద్ధంగా, తగిన ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలమన్నారు. హక్కులతో పాటు విధి నిర్వహణలో బాధ్యతలను కూడా సమానంగా గుర్తించాలని సూచించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తూ వారి భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

టి హెచ్ డబ్ల్యు ఓ ఎస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు అనేక పరిపాలనా, సాంకేతిక, ఉద్యోగపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. విధుల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు, స్పష్టమైన మార్గదర్శకాలు, మెరుగైన పని వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అంశాల వారీగా క్రోడీకరించి TNGOs జిల్లా నాయకత్వం సహకారంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

సమస్యలపై విస్తృత చర్చ

సమావేశంలో ప్రధానంగా ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, యూనిఫైడ్ వెల్ఫేర్ హాస్టల్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలులో ఇబ్బందులు, విద్యార్థుల వివరాలు, ఇండెంట్ నమోదులో సమస్యలు, సెంట్రల్ పర్చేజ్ ద్వారా సరుకుల సరఫరాలో జాప్యం, పెరిగిన ధరలకు అనుగుణంగా పాత మెనూ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, నూతన మెనూ రూపకల్పన, ఉద్యోగుల సర్వీస్ అంశాలు, పదోన్నతులు, ఇంక్రిమెంట్లపై చర్చించారు.

పలువురు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తమ వసతి గృహాల్లో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను వివరించారు. సాంకేతిక కారణాలతో హాజరు నమోదు కాకపోవడం, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదులో ఇబ్బందులు, సరుకులు సకాలంలో అందకపోవడం, అదనపు పని ఒత్తిడి వంటి సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో టిఎన్జిఓఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు బెజ్జంకి ప్రభాకరాచారి, ఇరిగేషన్ ఫోరం అధ్యక్షుడు డి. రాజ్‌కుమార్, టి హెచ్ డబ్ల్యు ఓ ఎస్ ఫోరం జిల్లా కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు, కోశాధికారి కంభం తిరుపతిరావు, పి. హనుమంతరావు, మెట్టు వీరన్న, చింతకాయల కృష్ణ, విజయ, బజ్జూరి వెంకటేశ్వర్లు, కే. వీరభద్రరావు, కె. వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, జోష్నా, నాగమణి, మల్లారెడ్డి, బాలాజీ, బాలు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖలకు చెందిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



గ్రంథాలయాల అభివృద్ధికి ప్రముఖుల చేయూత!



- **59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రత్యేక సభ్యత్వాల నమోదు**
- **ఖాదర్ బాబా చొరవతో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు సభ్యత్వాలు**
- **పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా పిలుపునిచ్చారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆయన ప్రత్యేక చొరవతో ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పలువురు ప్రముఖులకు ప్రత్యేక సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్లు పాకలపాటి శేషగిరి, రాపర్తి శరత్ కుమార్, కన్నం ప్రసన్న, గజ్జెల వెంకన్న, దోన్వాన్ రవినాయక్, సుద్రగాని ఉపేందర్, చెరువు బజార్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ మడూరి సైదారావు, బాలుసు లక్ష్మీ నాగేశ్వరరావు ప్రత్యేక సభ్యత్వాలు స్వీకరించారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు సైతం గ్రంథాలయంలో సభ్యత్వాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ ఖాదర్ బాబా మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజ విజ్ఞానాభివృద్ధికి కీలక కేంద్రాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, విజ్ఞానం పెంపొందించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో సభ్యత్వం తీసుకుని పఠన సంస్కృతిని ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు గ్రంథాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్ 1 గ్రంథపాలకులు సీహెచ్. మాల్సూర్, గ్రేడ్ 3 గ్రంథపాలకులు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి... జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

- **ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్ష సూచన**
- **అధికారులందరూ హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలి**

ఖమ్మం,ప్రతినిధి నవంబర్ -18 (భద్రాద్రి న్యూస్):-

ఆక్వాన్ తుఫాను పూర్తిగా ఖమ్మం జిల్లాలో కేంద్రీకృతమైంది ని సమాచారం ఉన్నప్పటికీ, ప్రస్తుత సమాచారం ప్రకారం (బుధవారం మ. 2.00 గంటల) అట్టి తుఫాన్ ఒరిస్సా, ఛత్తీస్ గడ్ వైపు దారిమళ్లిందని తెలిసిందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ, ఆక్వాన్ తుఫాన్ ఒరిస్సా , ఛత్తీస్ గడ్ లవైపు దారి మళ్లినం దున జిల్లాపై తుఫాన్ ప్రభావం కొంత తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్ష పాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ హెచ్చ రికలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

అధికారులు, సిబ్బంది ఎవరూ కూడా హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లకూడదని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఏవైనా సెలవులు ఉంటే వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని అన్నారు. వరద నియంత్రణ ప్రొటోకాల్స్ అందరూ విధిగా పాటించాలని స్పష్టం చేశారు.

రోడ్లపై ఎక్కడైనా నీరు పొర్లుతున్నా, లోతైన వంతెనలు లేదా కల్వర్టులు నీట మునిగినా వెంటనే ఆయా మార్గాలను బ్లాక్ చేసి ట్రాఫిక్ నిలిపివేయాలని కలెక్టర్ అన్నారు. స్థానిక తహ శీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

గాలి వానలకు చెట్లు లేదా కొమ్మలు విద్యుత్ తీగలపై పడిపోతే వాటిని వెంటనే తొలగించడానికి ఉడ్ కట్టర్స్, ట్రీ కట్టర్స్ వంటి పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు పూర్తి సన్నద్ధతతో సిద్ధంగా ఉండాలన్నారు.

మత్స్యకారులు ఎవరు కూడా చెరువులు, కుంటలు, వాగుల వైపు చేపల వేటకుగాని, ఈత కొట్టడానికి గానీ వెళ్లకూడ దని మత్స్యశాఖ ద్వారా గట్టిగా హెచ్చరించాలని, సోషల్ మీడియాలో ఇన్స్టాగ్రామ్ , రీల్స్ మొదలైన వాటిలో రీల్స్ చేయడం కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లరాదని, దీనిపై అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. పరిస్థితిని బట్టి అవసరమైన చోట సహాయక చర్యల కోసం ఈ నెల 21, 22 తేదీల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను అందుబాటు లో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అన్నారు.

పరిస్థితి తీవ్రతను బట్టి, స్థానిక పరిస్థితుల ఆధారంగా పా ఠశాలలకు, విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే పూర్తి అధికారం జిల్లా విద్యా శాఖ అధికారి, సంక్షేమ విద్యా సంస్థల అధికారులకు ఇస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రజ లందరూ అప్రమత్తంగా వుంటూ, అధికార యంత్రాంగా నికి సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



అతి చిన్న వయసులోనే హైకోర్టు న్యాయవాదిగా శ్రీ చక్రపాణి

- **అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తూ, క్లిష్టమైన కేసులను సైతం అలవోకగా ఛేదిస్తున్న యువ న్యాయవాదికి అభినందనలు.!**
- **చిన్న వయసులోనే న్యాయ పోరాటంలో సంచలనం..**
- **పెద్ద కేసులను ఛేదిస్తున్న యువ హైకోర్టు న్యాయవాది.!**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (భద్రాద్రి న్యూస్):-

పట్టుదల, అంకితభావం, న్యాయశాస్త్రంపై అపారమైన పట్టు ఉంటే వయసుతో సంబంధం లేకుండా అత్యున్నత విజ యాలను సాధించవచ్చని నిరూపిస్తున్నారు యువ హైకోర్టు న్యాయవాది పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి అతి చిన్న వయసులోనే న్యాయవాద వృత్తిని ఎంచుకున్న ఆయన, నేడు ఉన్నత న్యాయస్థానంలో హై కోర్టు ఎన్నోక్లిష్టమైన, కీలకమైన కేసులను సమర్థవంతంగా వాదిస్తూ అందరి ప్రశంసలు అం దుకుంటున్నారు..

న్యాయవాద వృత్తిలో అద్భుత ప్రతిభ సాధారణంగా న్యా యవాద వృత్తిలో అనుభవం గడించడానికి చాలా ఏళ్ల పడుతుంది.. కానీ పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి తన పదునైన వాదనలతో, చట్టాలపై ఉన్న లోతైన అవగాహనతో అతి తక్కువ కాలంలోనే సీనియర్ న్యాయవాదుల సరసన నిలిచారు.. సివిల్, క్రిమినల్, రాజ్యాం గబద్ధమైన కీలక కేసులలో బాధితులకు న్యాయం చేకూర్చడం లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు..

కక్షిదారులకు భరోసా.. యువతకు ఆదర్శం

న్యాయస్థానంలో ఆయన వినిపించే బలమైన వాదనలు ఎందరో కక్షిదారులకు (క్లయింట్స్) కొండంత భరోసానిస్తు న్నాయి.. సామాన్యులకు సత్వర న్యాయం అందాలనే లక్ష్యం తో ఆయన చేస్తున్న కృషి పట్ల తోటి న్యాయవాదులు, శ్రేయో భిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. చిన్న వయసులోనే ఇంతటి గొప్ప స్థాయికి చేరుకున్న పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీ చక్రపాణి నేటి యువతకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నారు.. భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు..

ఆయన ఇటీవల విజయం సాధించిన కేసు..

-25 వేల వివాదంలో కీలకమైన న్యాయపరమైన ఉపశమనం..

అడ్వకేట్ వివిఎల్ఎస్ శ్రీచక్రపాణి న్యాయవాద ప్రతిభను ప్ర స్తావించాల్సి వచ్చినప్పుడు, తెలంగాణ హైకోర్టులో దాఖలైన డబల్యు.పి. నెం.35403 ఆఫ్ 2026 ప్రత్యేకంగా ప్రస్తావిం చదగిన కేసుగా నిలుస్తుంది.. సైబర్ నేరానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఒక విద్యార్థికి చెందిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతా నిలిపివేయబడింది.. ఆ ఖాతాలోకి అను మానాస్పద లావాదేవీ ద్వారా రూ.25,000 జమ అయిన ట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.. అయితే, వివాదాస్పద మొత్తం రూ.25,000 మాత్రమే అయినప్పటికీ, మొత్తం బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడంతో విద్యార్థి తన ఇతర చట్టబద్ధమైన ఆర్థిక లావాదేవీలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది.. ఈ నేపథ్యంలో పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ పుల్లబోట్ల వివిఎల్ఎస్ శ్రీచక్రపాణి, వివాదాస్పద మొత్తాన్ని మాత్రమే నిలుపుదల చేసి, మిగిలిన ఖాతా కార్యకలాపాలను కొనసాగించేందుకు అనుమతించా లనే కీలకమైన న్యాయపరమైన అంశాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.. ఈ వాదనలకు మద్దతుగా మద్రాస్, కేరళ, తెలంగాణ హైకోర్టులలో వెలువడిన ఐదు న్యాయపూర్వ తీ ర్పులను ఆధారాలుగా సమర్పించారు.. బ్యాంకు ఖాతాను పూర్తిగా స్తంభింపజేయడం కంటే, దర్యాప్తు ప్రయోజనాలను కాపాడుతూ వివాదాస్పద మొత్తానికే పరిమితి విధించడం సముచితమనే వాదనను సమర్థంగా వినిపించారు.. ఈ కేసులో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశం పిటిషనర్‌కు గణనీయ మైన ఉపశమనాన్ని కల్పించింది.. రూ.25,000 మొత్తంపై లియన్ కొనసాగిస్తూ, మిగిలిన లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాను తిరిగి వినియోగించుకునేందుకు అనుమతించాల ని సంబంధిత బ్యాంకును హైకోర్టు ఆదేశించింది.. ఈ తీర్పు దర్యాప్తు ప్రయోజనాల పరిరక్షణతో పాటు వ్యక్తుల చట్టబద్ధ మైన ఆర్థిక హక్కులను కూడా సమతుల్యం చేయాల్సిన అవ సరాన్ని స్పష్టం చేసింది.. ఈ కేసులో శ్రీచక్రపాణి వినిపించిన వాదనల ప్రాధాన్యత ఇదే..

సుప్రీంకోర్టు స్థాయి న్యాయపరమైన అనుభవం..

శ్రీచక్రపాణి న్యాయవాద ప్రయాణంలో సుప్రీంకోర్టు అనుభవం కూడా ఒక ముఖ్యమైన అంశం.. భారత ప్రధాన న్యాయమూర్తి గా పనిచేసిన జస్టిస్ ఎన్.వి.రమణ కార్యాలయంలో ఇంట ర్న్‌గా పనిచేసిన సమయంలో అడ్మిషన్ విషయాలపై సంక్షిప్త నోట్లు సిద్ధం చేయడం, బెయిల్ అంశాలు, ట్రాన్స్‌ఫర్ పిటిషన్లు, మధ్యవర్తిత్వ చట్టానికి సంబంధించిన నిబంధనలపై పరిశోధన చేయడం వంటి బాధ్యతలను నిర్వహించారు.. అలాగే, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వద్ద కూడా ఇంటర్న్‌షిప్ ద్వారా న్యాయస్థాన కార్యకలాపాలపై విలువైన అనుభవాన్ని పొందారు.. అనంతరం అడ్వకేట్ ఎం.కె.జలీల్ వద్ద న్యాయవాద వృత్తికి సంబంధించిన అనుభవాన్ని పెంపొం దించుకుని, గురుగ్రామ్‌లోని ఏస్ &ఏ లా ఆఫీసుస్ సంస్థలో డిస్ప్యూట్ రేసొల్యూషన్ విభాగంలో అసోసియేట్‌గా పనిచే శారు.. ఈ అనుభవాలు వివాద పరిష్కారం, కేసుల పరిశీలన, న్యాయపరమైన వ్యూహరచన వంటి అంశాల్లో ఆయనకు ప్రా యోగిక అవగాహనను అందించాయి..



